క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న పోలీస్ పికెట్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో శనివారం పోలీస్ పికెట్ నిర్వహించారు. డీఎస్పీ యు.రవి చంద్ర ఆధ్వర్యంలో సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతి బాస్ సిబ్బందితో కలిసి పట్టణంలో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉన్న నేపథ్యంలో ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరి మూకలను అడ్డుకునేందుకు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సైతం శాంతి భద్రల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

పోలవరంలో మాక్‌డ్రిల్

పోలవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండదాదని పోలవరం డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి సూచించారు. పోలవరం గ్రామంలో శనివారం రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు శాంతిభద్రతలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా అల్లరిమూకలు చెల్లాచెదురుచేయడమే మాక్ డ్రిల్ ఉద్దేశ్యమన్నారు. శాంతిభద్రతలను పరిరక్షణ చేయడంపై అవగాహన కల్పించారు. ఎవరైనా ప్రజా జీవనానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమన్వయం పాటించాలని కోరారు. ఈయన వెంట సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రోడ్డు మార్గంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కొయ్యలగూడెం: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉపాలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ద్వితీయ కల్యాణోత్సవం ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మాటూరు సుధీర్, నాగ వెంకట కాశీ అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా ఈ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారి కల్యాన్ని వీక్షించి తరించాలని అర్చకులు కోరారు. భక్తులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి చేశామని, మహిళలు, పురుషులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరవ్వాలని ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి సూచించారు.

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని వినతి



చింతలపూడి నియోజకవర్గ ఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వీడియోగ్రాఫర్లు

చింతలపూడి: ఎన్నికల విధులు నిర్వహించిన తమకు అందించే వేతనం విషయంలో తగు న్యాయం చేయాలని చింతలపూడి నియోజకవర్గ 4 మండలాల వీడియోగ్రాఫర్‌లు రిటర్నింగ్ అధికారి అద్దయ్యను కోరారు. ఈమేరకు శనివారం ఆర్వో అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల్లో తాము 12 గంటల డ్యూటీకి వేతనంగా రూ. 1800 అందుకున్నామని, ఈ ఎన్నికల్లో వేతనాన్ని రూ.2500 ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు. ఎన్నికల విధులకు గాను కొంత సొమ్ము అడ్వాన్స్ ఇచ్చారన్నారు. తాము గత నెల 13వ తేదీ వరకు విధులు నిర్వహించామని, ఈ విధులకు సంబంధించి సొమ్ముల విషయంలో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించగా, సరైన సమాచారం లభించలేదన్నారు. కావున తమ వినతిని పరిశీలించి 12 గంటల డ్యూటీకి గత నెల 12వ తేదీన వచ్చిన జీవో ప్రకారం రూ.2,350 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు, ఎంఎం.రాజు, పి.బాబు, కె.శ్రీధర్, వి.మధుసూధనరావు, రామయ్య, ఆర్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నగదు చెల్లింపు

గణపవరం: మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.75.19 కోట్ల విలువైన 34,441 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకూ రైతులకు రూ.31.95 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ.43.24 కోట్లు త్వరలోనే చెల్లిస్తామన్నారు. కాల్వలకు నీరు విడుదల చేసినందున రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని సూచించారు. ఈ నెల 5, 6 నాటికి అన్ని కాలువలకు నీరు చేరుతుందని, నారుమడులు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్‌బీకేలలో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు

టి.నరసాపురం: మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా టి.నరసాపురం బంద్రేవు వద్ద కొనకళ్ల మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. కృష్ణాపురంలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో బంజారా భజరంగభేరి కమిటీ ఆధ్వర్యంలో ఈ జయంతి ఉత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా బంద్రేవు ఆలయం వద్ద, తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే కృష్ణాపురం పంచముఖ హనుమాన్ ఆలయం వద్ద దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించి, అన్నసమారాధన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి మధు, దేరవపల్లి సీతారామ్‌ప్రసాద్, కన్నం సర్వేశ్వరరావు, వేణు, మాజీ సర్పంచ్ జరబల పూర్ణయ్య, భూక్యా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంతి ఉత్సవాలు

కొయ్యలగూడెం: హనుమజ్జయంతి వేడుకలు శనివారం మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన ఆరిపాటి ఆంజనేయస్వామి ఆలయం, అదేవిధంగా పద్దెనిమిది పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సరిపల్లి సమీపంలోని పంచముఖ ఆంజనేయ స్వామిని విశేషంగా అలంకరించి విశేష పూజలు చేశారు. నరసన్న పాలెం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెం, కొయ్యలగూడెం, కన్నాపురం, అచ్యుతాపురం, దిప్పకాయలపాడు ఆలయాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

శోభాయమానంగా స్వామివారి దర్శనం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమద్ జయంతి వేడుకలు శనివారం నేత్రపర్వంగా జరిగాయి. ముందుగా సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అర్చకులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనను జరిపారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయునికి పంచామృత స్నపన, సహస్ర నామార్చనను నిర్వహించారు. అలాగే స్వామివారికి హారతులిచ్చి, నివేదనను సమర్పించారు. అనంతరం వేడుకలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఏజెన్సీలో నెలకొన్న ఆధ్యాత్మిక శోభ

బుట్టాయగూడెం: హనుమాన్ జయంతి సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచే ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బుట్టాయగూడెం అభయాంజనేయస్వామి ఆలయంలో ఏకాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా 108 సార్లు భక్తులు పారాయణం చేశారు. జూన్ 8వ తేదీ వరకూ ఈ వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీవారు తెలిపారు. అలాగే రెడ్డిగణపవరం, కొమ్ముగూడెం, స్థానిక శివాలయం వద్ద, ముప్పినవారిగూడెం, తదితర గ్రామాల్లో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.



కొయ్యలగూడెం: విశేష అలంకరణలో సరిపల్లి సమీపంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి



టి.నరసాపురం: బంద్రేవు వద్ద ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



టి.నరసాపురం: కృష్ణాపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



కుక్కునూరు: వెంకటాపురం అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం



ద్వారకాతిరుమల: ఆంజనేయస్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు



జంగారెడ్డిగూడెం: పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఆలయంలోని స్వామివారికి పూజలు చేసిన దృశ్యం



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కొలువై పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

హనుమాన్ చాలీసా పారాయణం

కుక్కునూరు: హనుమద్ జయంతిని పురస్కరించుకుని మండలంలోనీ రామాలయాల్లో, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కునూరులోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం, రామసింగారంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆకుపూజ, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. రామాలయాల్లో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని చేశారు. కొండపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి తమలపాకులతో పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

జంగారెడ్డిగూడెం రూరల్: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని శనివారం వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను సునీల్‌కుమార్‌కి అందజేశారు. ముందుగా స్థానిక నాయకులు కారుమూరికి స్వాగతం పలికారు. మద్ది దేవస్థానం చైర్‌పర్సన్ కీసరి సరిత, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, పార్టీ నాయకులు మేడవరపు విద్యాసాగర్, గురజాల పార్థసారథి, రాఘవరాజు ఆదివిష్ణు, మల్నీడి బాబి, చిటికెల అచ్యుతరామయ్య, ముప్పిడి శ్రీనివాసరావు, దల్లి నాగేశ్వరరావు, సాయిల స్వాతి, కొప్పుల రవిచంద్రారెడ్డి, లాల్ అహ్మద్, నేట్రు గణేష్, శీలం కృష్ణంరాజు, మద్ది ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌ను దర్శించిన భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో హనుమద్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గంగానమ్మ గుడి వెనుక ఉన్న ఆంజనేయస్వామి, బుట్టాయగూడెం రోడ్‌లోని దాసాంజనేయస్వామి, పట్టణంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

మహిళామణులే.. నిర్ణేతలు

- కీలకంగా మారిన మహిళల ఓటింగ్
- పురుమల కంటే అదనంగా 6,208 మంది మహిళల ఓటింగ్



బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు (ఫైల్)

బుట్టాయగూడెం: పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో విజేతను నిర్ణయించడంలో మహిళా ఓటర్లు కీలకంగా మారారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గత నెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలవరం నియోజకవర్గంలో 2,53,981 మంది ఓటర్లు ఉండగా 2,18,366 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 85.98 శాతం పోలింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 1,06,07 మంది, స్త్రీలు 1,12,285 మంది, ఇతరులు 4 మంది ఉన్నారు. అయితే పురుషులతో పోలిస్తే 6208 మంది మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రతి మండలంలోనూ మహిళలదే పైచేయి

పోలవరం నియోజకవర్గంలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు విలీన మండలాలుగా ఉన్నాయి. వీటితోపాటు కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాలు కూడా ఉన్నాయి. వీటిలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి మండలంలోనూ పురుషులతో పోల్చుకుంటే మహిళా ఓటర్లే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. అయితే గతంతో పోల్చుకుంటే మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం ఓటింగ్ శాతం కూడా పెరిగింది. వేలేరుపాడు మండలం గోదావరి పరీవాహక శివారు గ్రామమైన కాకీన్నూరులో 93.22 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా పురుషుల కంటే 38 మంది మహిళలు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలవరం మండలం అటవీప్రాంతంలో గల గడ్డపల్లిలో 87.78 శాతం పోలింగ్ నమోదైంది. ప్రతి బూత్‌లో కూడా పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో విజేతను నిర్ణయించడంలో మహిళల పాత్ర కీలకంగా మారింది.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ



చింతలపూడి ఎన్‌వీఎన్ కాలనీలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

చింతలపూడి: ఎన్నికల నేపథ్యంలో టీడీపీ కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి పింఛన్ల పంపిణీని అడ్డుకోవాలని చూసినా ప్రభుత్వం మాత్రం సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తోంది. ఎన్నికల కోడ్ ఇంకా అమల్లోనే ఉండటంతో ఈ నెల కూడా సచివాలయ ఉద్యోగులు శనివారం నుంచి పింఛన్ల పంపిణీని చేపట్టారు. వికలాంగులు, రోగులకు మాత్రం ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. మిగిలిన వారికి ఆయా సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు 37,789 మంది పింఛన్‌దారులకు పింఛన్లు అందిస్తున్నారు. చింతలపూడి మండలంలో 9,612 మంది పింఛన్‌దారులకు రూ.2,88,88,500 విడుదలైనట్లు ఎంపీడీఓ చిన రాటాలు తెలిపారు. వీరిలో ఆధార్ లింక్ అయిన 7,285 మందికి రూ.2,18,55,000 లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 2,327 మంది పెన్షన్‌దారులకు రూ.70,33,500 సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందజేస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రతి నెలా ఉదయం 5 గంటలకే వలంటీర్లు వృద్ధుల చేతిలో పింఛన్ సొమ్ము పెట్టేవారు. ఎన్నికల కోడ్ నెపంతో విపక్ష పార్టీల నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి పింఛన్లు అందచేయకుండా వలంటీర్ల సేవలను అడ్డుకోవడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలు గత మూడు నెలలుగా పింఛన్ తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏజెంట్లకు మద్యం నిర్ధారణ పరీక్షలు



ఈ శ్రీనివాసులు, ఏలూరు డీఎస్పీ, కౌంటింగ్ సెంటర్స్ ఇన్‌చార్జి

దెందులూరు: కౌంటింగ్ రోజు లోపలికి వెళ్లే చీఫ్, ఏజెంట్లకు విధిగా మద్యం నిర్ధారణ పరీక్షలు చేస్తామని, మద్యం సేవించిన వారిని కౌంటింగ్ హాలులోకి అనుమతించమని ఏలూరు డీఎస్పీ, కౌంటింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి (రక్షణ విభాగం) ఈ.శ్రీనివాసులు అన్నారు. శనివారం డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్‌కు వచ్చేవారితో సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలు వాట్సాప్ గ్రూపుల్లో విమర్శలు, దూషణలు చేయరాదని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లోని పోస్టులకు ఆ గ్రూపు అడ్మినే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలపై పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని, అడ్మిన్లు పోస్టింగుల విషయంలో తమ గ్రూపు సభ్యులను హెచ్చరించాలని కోరారు. కౌంటింగ్ సెంటర్ పరిధిలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉంటాయన్నారు. ఈ నెల 6 వరకు ఇద్దరు లేదా ముగ్గురికి మించి ప్రజలు గుమికూడరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషిద్ధమని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులందరిపై నిఘా ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశంపై వివిధ అధికారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకేవీ బుల్లి కృష్ణ మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్, బయో మెడికల్ మొదలైన వ్యర్థాల నిర్వహణ అనగా... సేకరించడం, పునరుత్పత్తి చేయడం, పూర్తి నిర్మూలనపై అందుబాటులో ఉన్న శాస్త్రీయతను వివరించారు. మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రయ్య మాట్లాడుతూ అందుబాటులోని వనరులను ఉపయోగించుకుంటూ వ్యర్థ పదార్థాలను సేకరించి, వాటి పునరుత్పత్తి చేస్తారని తెలిపారు. నగర ప్రజలు కూడా కార్పొరేషన్‌కు సహకరించాలని కోరారు. వివిధ రకాల వ్యర్థాలను సేకరణ, పునరుత్పత్తి, శాశ్వత నిర్మూలన అంశాలపై ఉన్న శాస్త్రీయపరమైన విధి విధానాలను, వాటికి రూపొందించిన చట్టాలను రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగరత్నం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కూన కృష్ణారావు వివరించారు. ఈ సందర్భంగా ఏపీ పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్‌లను విడుదల చేసి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ ఆస్పత్రులు, పరిశ్రమల ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాంబాబు నాయక్



చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చిన రాట్నాలు

చింతలపూడి: మండలంలో విద్యుత్ కొరత, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు బాణావతు రాంబాబు నాయక్ ఆదేశించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ బి రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు సమస్యలపై చర్చ జరిగింది. గృహనిర్మాణ శాఖ, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై సభలో చర్చ జరిగింది. వర్షాకాలంలో గ్రామాల్లో మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చిన రాట్నాలు ఆదేశించారు. మురికి నీరు నిల్వ ఉండటం కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. గ్రామ పంచాయతీ అధికారులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు, జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదే విధంగా వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ రాంబాబు నాయక్ మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి ఈ నెల 4వ తేదీన ఉదయం 6 గంటలలోపు గుర్తింపు కార్డులతో ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో హాజరు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున 144సెక్షన్, సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు, సభలు, బాణసంచా కాల్చరాదన్నారు. కౌంటింగ్ రోజున మద్యం విక్రయాలు నిషేధమన్నారు. సిబ్బందితో సహా ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్లు సీజ్ చేసి జిల్లా ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలపై జాయింట్ కలెక్టర్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర, ఎంపీడీఓ పీ.శ్రీలతతో పాటు నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.